క్లుప్తంగా

మంత్రిని కలిసిన కలెక్టర్



మంత్రికి పూలమొక్క అందజేస్తున్న కలెక్టర్ మను చౌదరి

హుస్నాబాద్: కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ మనుచౌదరి బుధవారం హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. కలెక్టర్‌కు శాలువా కప్పి మంత్రి అభినందించారు. జిల్లాలో వెనుకబడిన ప్రాంతమైన హుస్నాబాద్ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

అనివేటి మండపానికి శంకుస్థాపన



శిలన్యాస భూమిపూజ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ దేవాలయంలో బుధవారం కలెక్టర్ మనుచౌదరితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ అనివేటి మండపానికి శంకుస్థాపన, శిలాన్యాస భూమిపూజ చేశారు. ముందుగా ఆలయ అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి, కలెక్టర్ ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు పున్న లావణ్య, చిత్తారి పద్మ, గౌడ సంఘం నాయకులు పూదరి లక్ష్మీనారాయణ, పచ్చిమట్ల శ్రీనివాస్ గౌడ్, పూదరి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మను చౌదరి

కోహెడ(హుస్నాబాద్): మండలంలోని వివిధ గ్రామాలకు మంజూరైన పలు అభివృద్ధి పనులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కలెక్టర్ మనుచౌదరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోహెడ మల్లన్న ఆలయం నుంచి సముద్రాల క్రాస్ రోడ్డు వరకు రెండు వరుసల బీటీ పనులకు రూ.15 కోట్లు, మండలంలోని 11 గ్రామాలకు రూ.50 లక్షలు అభివృద్ధి పనులకు మంజూరయ్యాయన్నారు. మరో 12 గ్రామాలకు రూ.28 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. నిర్మాణాలను ఆయా శాఖల అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

అధికారులపై ఫిర్యాదు

కోహెడ(హుస్నాబాద్): కోహెడ గ్రామ పంచాయతీ కార్యదర్శి దేవేందర్, ఎంపీఓ సురేష్‌పై కోహెడకు చెందిన ముంజ రాజేందర్‌గౌడ్ కలెక్టర్ మనుచౌదరికి ఫిర్యాదు చేశాడు. బుధవారం కోహెడలో వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన కలెక్టర్‌ను కలుసుకొని తనగోడు చెప్పుకున్నాడు. కరెంటు మీటరు మంజూరుకు ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని కార్యదర్శికి దరఖాస్తు చేసుకున్నానని, మంజూరు పత్రం జారీ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని చెప్పాడు. ఈ విషయంపై ఎంపీఓను సంప్రదించగా అతను కూడా తనపై దురుసుగా వ్యవహరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరాడు.

రోడ్డు విస్తరణ బాధితులను ఆదుకోవాలి



వినతి పత్రం అందిస్తున్న డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రవిబాబు

సిద్దిపేటరూరల్: రోడ్డు విస్తరణ బాధితులను ఆదుకోవాలని డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రవిబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం బాధితులతో కలిసి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కొండపాకలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టడంతో కొందరు ఇళ్లు కోల్పోయారన్నారు. బాధితులకు మాజీ సర్పంచ్ ఇల్లు, రూ.10 లక్షల ఆర్థిక సాయం అందిస్తానని బాండ్ పేపర్ మీద రాసి ఇచ్చిందన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదని, అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

నిర్మించారు.. వదిలేశారు

- పదేళ్ల క్రితం రాజీవ్ యువకేంద్రం ఏర్పాటు
- ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభించని వైనం
- స్టడీ సెంటర్‌గా మారుస్తామని ఎమ్మెల్యే వెల్లడి
- యువతలో చిగురిస్తున్న ఆశలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బెజ్జంకి క్రాసింగ్‌లోగల రాజీవ్ రహదారి పక్కన 2013లో ఇంటిగ్రేటెడ్ యాక్షన్ ప్లాన్(ఐఏపీ) కింద రూ.23 లక్షల వ్యయంతో రాజీవ్ యువ కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా మారింది. యువతకు విజ్ఞానంతోపాటు మానసిక ఉల్లాసానికి ఉపయోగపడుతుందని అప్పటి కరీంనగర్ ఎంపీ, ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయించి దీనిని నిర్మించారు. ప్రారంభోత్సవానికి జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. అదే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభోత్సవం నిలిచిపోయింది. అప్పటి నుంచి నిరుపయోగంగా మారింది. నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడ్డ బెజ్జంకి క్రాసింగ్ కొత్త గ్రామ పంచాయతీ భవనం నిర్మించే వరకు కొన్ని నెలలు తాత్కాలికంగా వినియోగించారు. ప్రస్తుతం మిషన్ భగీరథ సామగ్రి భద్రపరిచారు. కిటికీలు, డోర్లు, వైరింగ్ ధ్వంసమయ్యాయి. ఇటీవల మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ పరిశీలించి స్టడీ సెంటర్‌గా మారుస్తామని ప్రకటించారు. త్వరగా ప్రారంభించాలని కోరుతున్నారు.



యువ కేంద్రంలో భద్రపరిచిన మిషన్ భగీరథ సామగ్రి



ధ్వంసమైన కిటికీలు

వినియోగంలోకి తెస్తాం



బెజ్జంకిలో పదేళ్ల క్రితం రూ.లక్షలు ఖర్చు పెట్టి నిర్మించిన యువ కేంద్రాన్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదు. విద్యార్థులు, యువకులకు ఉపయోగపడుతుంది. మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేసి వినియోగంలోకి తెస్తారు.

– మానాల రవి, కాంగ్రెస్ నాయకుడు

నీటి ఎద్దడి రాకుండా చూడాలి

- ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించండి
- ఎంపీపీ పాండుగౌడ్

మర్కూక్(గజ్వేల్): ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో అధికారులు తమను పట్టించుకోకపోవడమే కాకుండా ప్రొటోకాల్ పాటించడం లేదని మర్కూక్ మండల ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మర్కూక్ మండల కేంద్రంలో ఎంపీపీ పాండుగౌడ్ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమతమ నివేదికలను సమర్పించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రతిపక్ష నాయకులను కించపరచలేదని, అధికారిక కార్యక్రమాలకు వారిని ఆహ్వానించామన్నారు. అధికారుల పాలన రావడంతో గ్రామాల్లో చేపట్టే ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదని, హోదాను గుర్తించకుండా వ్యవహరిస్తున్నట్లు ఎంపీటీసీలు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఇకపై అలా జరగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.



మాట్లాడుతున్న ఎంపీపీ పాండుగౌడ్

అలాగే గ్రామాల్లో నీటిఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కొండపోచమ్మ సాగర్ నుంచి పొలాలకు సాగునీరు అందడంలేని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. మండలంలోని గంగాపూర్– యూసుఫ్‌కాన్‌పల్లి, గణేష్‌పల్లి గ్రామాల్లో రేషన్ సరుకులు ఇవ్వడంలేదని ఇటీవల సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైందని, ఆయా గ్రామాల్లో తాత్కాలికంగా రేషన్ షాపులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రావును ఆదేశించారు. సమావేశంలో జెడ్పీటీసీ మంగమ్మ, ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఎంపీడీఓ అఫ్జలుద్దీన్, ఎంపీటీసీలు కృష్ణ యాదవ్, ధనలక్ష్మి, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

విద్యార్థుల ప్రతిభ వెలికి తీయాలి

ఎంఈఓ దేశిరెడ్డి

హుస్నాబాద్‌రూరల్: ప్రాథమిక దశలోనే విద్యార్థుల ప్రతిభను వెలికితీయాలని ఎంఈఓ దేశిరెడ్డి అన్నారు. బుధవారం మీర్జాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహిస్తే వారు పాఠశాలలకు వచ్చేందుకు ఆసక్తి చూపుతారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రేఖారాణి, మాజీ సర్పంచ్ లత, పొన్నబోయిన శ్రీనివాస్, గంగారపు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన



స్వయంపాలన దినోత్సంలో పాల్గొన్న కొల్గూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులు



స్వయంపాలన దినోత్సంలో పాల్గొన్న తిమ్మారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

గజ్వేల్: గజ్వేల్ మండలం కొల్గూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమాన్ని కాంప్లెక్స్ హెచ్‌ఎం సుగుణాకర్, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కొండపాక(గజ్వేల్): మండలంలోని తిమ్మారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. డీఈఓగా శ్రీహరి, హెచ్‌ఎంగా నిహారిక, ఎంఈఓగా గణేష్, ఉపాధ్యాయులుగా ఉపేందర్, సాయిచరణ్, కీర్తన, నిశాంత్, భార్గవి వ్యవహరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం సముద్రాల శ్రీనివాస్, హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రసన్నకుమారీ, హెచ్‌ఎం రఘురాములు, ఉపాధ్యాయులు షమీం బేగం, వెంకటరమణ పాల్గొన్నారు.

కార్పొరేషన్‌ల ఏర్పాటుపై హర్షం

కొండపాక(గజ్వేల్): ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై రెడ్డి సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిధిలోని బందారం గ్రామంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు పాలడుగు బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగారావు, పర్శరాములు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షనీయమని ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలోపెట్టి అమలు చేయలేదని, ఇప్పుడు కేబినెట్‌లో ఆమోదించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు గుజ్జ చంద్రశేఖర్, కోశాధికారి చింత రాజేంద్రప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గంప కృష్ణమూర్తి, సేవాదళ్ నాయకులు కటకం మౌనయ్య, మర్యాల వీరేశం, అవోప రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయిత కిషోర్, వాసవీ వనిత క్లబ్ అధ్యక్షురాలు మర్యాల వాణి, వాసవీ క్లబ్ సిద్దిపేట అధ్యక్షుడు చేకిలం రవి, సిద్దిపేట పట్టణ మహిళ విభాగం అధ్యక్షురాలు సుష్మ పాల్గొన్నారు.



బందారంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై ఆర్యవైశ్య సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. బుధవారం చేర్యాలలో పట్టణ ఆర్యవైశ్య సంఘం, కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పట్టణ వైశ్యసంఘ ప్రతినిధులు లింగం, శివకుమార్, ఆంజనేయులు, సిద్దిలింగం, కొండయ్య, బాలనారాయణ, నాగరాజు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చిరంజీవి, మల్లన్న ఆలయ డైరెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకు సాగాలి

ములుగు ఎంపీపీ లావణ్య

ములుగు(గజ్వేల్): సమస్యల పరిష్కారానికి, మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ములుగు ఎంపీపీ లావణ్య అన్నారు. బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యలు రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీటీసీలు తమ గ్రామాల సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయా శాఖల అధికారులు సమాధానం ఇచ్చారు.



నివేదికను చదువుతున్న అధికారి

అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సమావేశంలో జిల్లా కోఆప్షన్ సభ్యుడు సలీం, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకట శ్రీరామకృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్లమాంబ జయంతి

గజ్వేల్: కవయిత్రి మొల్లమాంబ 584వ జయంతిని కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని సంగాపూర్ రోడ్డులోగల ఆమె విగ్రహానికి పూలమాలలు నివాళి అర్పించారు. కార్యక్రమంలో గజ్వేల్ మండల కుమ్మరి సంఘం అధ్యక్షుడు నాగపురి బాబు, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి నాగపురి రమేశ్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి స్వామి, నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కవయిత్రి మొల్లమాంబ జయంతిని జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం జిల్లా కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కుమ్మర సంఘం అధ్యక్షుడు దరిపల్లి శ్రీనివాస్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు రాంచంద్రం, జిల్లా కోశాధికారి నాంపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో మొల్లమాంబ విగ్రహానికి పూల మాలలు వేస్తున్న కుమ్మరి సంఘం నాయకులు

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

సిద్దిపేట అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి

సిద్దిపేటకమాన్: జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులను పరిష్కరించాలని సిద్దిపేట అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి అన్నారు. సీపీ ఆదేశానుసారం పోలీసు అధికారులతో సిద్దిపేట ఏసీపీ, సంబంధిత సర్కిల్ కోర్టు డ్యూటీ సిబ్బందితో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీసు స్టేషన్‌లో సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు ఆయన అడిగి తెలుసుకున్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సిద్దిపేట ఏసీపీ మధు, వన్‌టౌన్ సీఐ లక్ష్మీబాబు, టూటౌన్ సీఐ ఉపేందర్, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ గురుస్వామి, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవీందర్

సిద్దిపేటకమాన్: ఇసుక, పీడీఎస్ రేషన్ బియ్యం అక్రమ రవాణ, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవీందర్ హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా నిఘా ఏర్పాటు చేశామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారం టాస్క్‌ఫోర్స్ ఏసీపీ 8712667445కు అందించాలన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు

సాక్షి ఎఫెక్ట్

అక్కన్నపేట(హుస్నాబాద్): ఈనెల 12వ తేదీన 'పారిశుద్ధ్యం అస్తవ్యస్తం' అపరిశుభ్రంగా జనావాసాలు అంటూ సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం ఎంపీడీఓ భానోతు జయరాం మాట్లాడుతూ గ్రామాల్లోని మురికి కాల్వలను తక్షణమే శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శి అనూషను ఆదేశించానన్నారు. డ్రైనేజీల్లో చెత్తాచెదారం ఉండకుండా కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.



రామవరం గ్రామంలో మురికి కాల్వను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

చేర్యాల(సిద్దిపేట): బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేర్యాల పీఏసీఎస్ చైర్మన్ బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలను బెదిరింపులకు గురిచేయడం సరికాదన్నారు. గత ప్రభుత్వం 30 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహిస్తే వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినట్లు చెబుతున్నారన్నారు. కొమ్మూరి కుటుంబ సభ్యులు బెదిరింపులకు పాల్పడుతున్నారని, అధికారులకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో ఎంపీపీ కరుణాకర్, వైస్ చైర్మన్ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు చంటి, సతీష్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

సంక్షిప్త వార్తలు

◆ నేడు సర్వసభ్య సమావేశం

నంగునూరు(సిద్దిపేట): మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తామని ఎంపీపీ జాప అరుణాదేవి తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, అన్ని గ్రామాల ప్రత్యేక అధికారులు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలన్నారు.

◆ చిరుధాన్యాల సాగు చేయాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని అలిరాజ్‌పేటలో కారిటాస్ ఇండియా ఉజ్వల సౌజన్యంతో సాగు చేస్తున్న చిరుధాన్యాల పంటలను మండల వ్యవసాయ అధికారి వసంతరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాల్లో పోషక విలువలు గోధుమలతో సరితూగుతాయని, ఎక్కువ పీచు పదార్థాలు కలిగి ఉంటాయన్నారు. కార్యక్రమంలో రైతులు కిష్టయ్య, కరుణాకర్, శ్రీహరి, కరుణాకర్‌రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

◆ పరీక్షా ప్యాడ్‌ల పంపిణీ

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి, గుండారం, రేగులపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం పెద్దాల శ్రీనివాస్ యాదవ్ పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.2,016 ఇస్తామని గుండారం ఎంపీటీసీ లత ప్రకటించారు.

◆ అపరిచితుల మాటలు నమ్మొద్దు

గజ్వేల్‌రూరల్: అపరిచితుల మాటలు నమ్మి మోసపోవద్దని, ప్రజలు చైతన్యవంతులై గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని గజ్వేల్ సీఐ సైదా అన్నారు. మండల పరిధిలోని బయ్యారం గ్రామంలో మంగళవారం రాత్రి కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గ్రామస్తులకు సైబర్ నేరాలు, నియంత్రణ, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

◆ ఎల్లమ్మ దేవాలయ హుండీ లెక్కింపు

హుస్నాబాద్: హుస్నాబాద్‌లోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. 2023 సెప్టెంబర్ 20 నుంచి 2024 మార్చి 13వ తేదీ వరకు భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించారు. మొత్తం రూ.2,24,549 వచ్చినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

◆ ఇసుక ట్రాక్టర్‌ల పట్టివేత

మద్దూరు(హుస్నాబాద్): అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు, మద్దూరు పోలీసులు తెలిపారు. దూళ్మిట్ట మండలంలో బెక్కల్ జనిగాల నుంచి అనుమతులు లేకుండా వల్లంపట్ల గ్రామానికి ఇసుక రవాణా చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న నందనబోయిన రాజుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ జగదీష్ తెలిపారు.

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి, మద్దూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో అక్రమ ఇసుక డంప్‌లను, ట్రాక్టర్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీజ్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం దాడులు చేయగా మండలంలోని వెలికట్ట గ్రామ శివారులో అక్రమ ఇసుక డంప్ సీజ్ చేసి, మద్దూర్ మండలంలోని వల్లంపట్ల శివారులో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు.

◆ రాజ్యాంగమే దేశానికి రక్ష

తొగుట(దుబ్బాక): భారత రాజ్యాంగమే దేశానికి రక్ష అని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ అన్నారు. మండలంలోని వెంకట్రావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బుధవారం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ చైతన్య యాత్ర ప్రారంభం

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం మంగోల్ గ్రామంలో అంబేద్కర్ వారసుల చైతన్య యాత్రను రాష్ట్ర వర్కింగ్ యూనియన్ జర్నలిస్టుల అధ్యక్షుడు విరాహత్ అలీ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గజ్వేల్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు ఎన్నెల్లి సురేందర్, మాజీ సర్పంచ్ పుల్లోజు కిరణ్‌కుమార్‌చారి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

సిద్దిపేటరూరల్: గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. బుధవారం నారాయణరావుపేట మండల కేంద్రంతో పాటు రూరల్ మండల పరిధిలోని ఇర్కోడ్ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు, వైస్ ఎంపీపీ సంతోష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి నుంచి తపాసుపల్లి, కొండపోచమ్మ రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వీటికి మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకుడు తేల ఇస్తారి డిమాండ్ చేశారు. బుధవారం అయినాపూర్ కొండపోచమ్మ ఆలయానికి వెళ్లే రోడ్డును కార్యకర్తలతో కలసి పరిశీలించారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు గుంతలమయంగా మారడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అయినాపూర్ నుంచి తపాస్‌పల్లి రోడ్డు కూడా రాకపోకలకు అనువుగాలేదని, వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు.

◆ కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

కొండపాక(గజ్వేల్): మండలంలోని వెలికట్ట గ్రామంలో కాంగ్రెస పార్టీ మండల అధ్యక్షుడు వాపరి లింగారావు ఆధ్వర్యంలో గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెరుగు తిరుపతి, ఉపాధ్యక్షుడిగా అమ్ముల కిషన్, ప్రధాన కార్యదర్శిగా దొమ్మాట మహేష్, కార్యదర్శిగా ఆరుట్ల బాబు, బీసీ సెల్ అధ్యక్షుడిగా పెరుగు ధర్మరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొమురవెల్లి శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా దొమ్మాట ప్రేమ్‌కుమార్, యూత్ అధ్యక్షుడిగా మత్తని మధు, జనరల్ సెక్రటరీగా అమ్ముల రజనీకాంత్, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జిగా మెరుగు ప్రభాస్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షులు ఎర్రబోయిన త్రినేష్, పెరుగు శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు.

◆ నిత్యాన్నదానానికి విరాళం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి నిత్యాన్నదాన కార్యక్రమానికి భక్తులు విరాళాలు అందజేసేందుకు ముందుకు వస్తున్నారు. బుధవారం హనుమకొండకు చెందిన భక్తుడు పెంచాల లక్ష్మణ్‌రావు రూ.1,00,116లు ఆలయ ధర్మకర్త లింగంపల్లి శ్రీనివాస్ ద్వారా ఆలయ ఏఈఓకు అందజేశారు.